# బావ వస్తాడు!

ఆ నిశీధిసమయంలో నళిని కిటికీ దగ్గర నిలబడి బయటి ప్రపంచాన్ని చూస్తోంది; నిరంతర ప్రశాంతతను ప్రకృతి ఆలపిస్తున్న ఆ వేళలో.

'భూమి తపస్సులో ఉంది - నాలాగే' అనుకుంది. 'ఈభూమి ఇట్లాగ పరిభ్రమించటం, ఇదంతా ఎందుకో! మౌనంగా ఈ భూమి చేసే తపస్సు ఎందుకో, ఎంతవరకో! నా మనసూ తపస్సులోనే ఉంది. ప్రతి కన్నెమనసూ అనుకూలుడైనవాడు భర్తగా దొరికేవరకూ తపస్సులోనే ఉంటుంది కాబోలు! నా మనసులో ఉన్న కోరిక ఒకటే - పెళ్ళీ, ప్రేమా ఒకటై తను అతడితో అద్వైతం పొందాలి. తనకింకేమీ అవసరం లేదు. ఈ తపస్సంతా దానికోసమే. ఇరవైరెండు సంవత్సరాలు ఈ తపస్సులో గడిచాయి. బావ రాకతో ఈ తపస్సు ఫలిస్తుందా! అన్వేషణ ముగుస్తుందా!

ఊరిచివర మేడమీద కిటికీలోనుంచి రాత్రి ప్రపంచాన్ని చూస్తుంటే తనలో కలిగిన భావనలకు తనే నవ్వుకుంది నళిని.

'నాకు ఏ కోరికలూ లేవు అనుకుంటాను. నేను యోగినినా? కాదు. నా మనసులో మోయలేని తీపికోరికలు ఉన్నాయి; కోరికల కలలు ఉన్నాయి. నేను రాగమయిని, విరాగిణినికూడా. ఇది ఒక విచిత్ర సమ్మేళనం.'

మనసులో ఆలోచనలు నింపుకుంటూ వరండాలో లైటు వేసింది నళిని. లైటు వెలగగానే ఆలోచనలు దూరంగా పోయాయి. గదిలో ఉన్న తన పక్కను జేరుకుని 'రేపు బావ వస్తున్నాడని సంతోషంగా ఉంది. తప్పకుండా బావ నాకు నచ్చుతాడు. ఎందుకు నచ్చడు? బావ మంచివాడు. ఆ విషయంలో నాకు నమ్మకం ఉంది. అంటే బావ నేను కోరుకునేవాడిలాగ ఉండాలని నా ఆశ కాబోలు!' అనుకుని నవ్వుకుంటూ నిద్రకి ఉపక్రమించింది.



6

ఆ మరునాడు తలంటి పోసుకున్న జుట్టును వదులుగా జడ అల్లుకుంది నళిని. నుదుట తిలకం సన్నగా, పొడుగ్గా దిద్దుకుంది. తెలుపుచీర కట్టి నలుపు బ్లౌజ్ ధరించింది. విశేషమైన ఆభరణాలేమీ ధరించలేదు.

సరోజ వచ్చి కనకాంబరాలు ముద్దగా గుచ్చినమాల జడలో పెట్టబోయింది.

''వద్దు సరూ! నేను వాసనలేని పూలు తలలో పెట్టుకోను'' అంది నళిని.

వరండాలో కేన్ ఛెయిర్‌లో కూర్చుని ఒడిలో ఉన్న పుస్తకంమీద చేతులు వేసుకుని, ఎక్కడో చూపులు చూస్తున్న నళినిని అర్థం కానట్లు చూసింది పద్దెనిమిదేళ్ళ సరోజ.

''ఇవేళకూడా ఈ బట్టలేనా, బావ వస్తుంటే'' అంది.

నళిని నవ్వి ''ఔను'' అంది.

''మరి ఆరోజు క్లబ్‌కి అంత చక్కగా అలంకరించుకున్నావు. ఇవేళ ప్రత్యేకమైన రోజు కదా ఇంత సామాన్యంగానా ఉండటం'' అంది సరోజ నిరుత్సాహపడిపోతూ.

''ఇవేళ ఇంతే'' అంది నళిని అదే నవ్వుతో. లోపలి కెళ్ళింది.

అదేరోజు సాయంత్రం స్టేషన్‌కు వెళ్ళినకారు మురళినీ, అతడి స్నేహితుడు శంకర్‌నూ తీసుకుని వచ్చింది. నళిని బావకోసం ఎదురుచూస్తూ మేడమీద ఉంది.

బావ వచ్చాడు!

నళిని హృదయం ఆనందంతో సందడించింది. కుడిచెయ్యి గుండెమీద వేసుకుని కుదురుచేసుకుంది హృదయాందోళనను. ఆనందమనే జ్యోతిని కనులలో వెలిగించుకుని, మనసులో సంతోషం సంగీతంగా, మధురమంజుల గానంగా రూపొందుతుంటే మెట్లు దిగుతోంది. మలుపు తిరిగితే బావ కనిపిస్తాడు. అంతమందిలో తను అతడిని చూడకలదా! మూర్ఛపోదుకదా! 'అంత వివశనైపోతే ఎట్లాగ' అనుకుంది.

''రాణీగారు ఇప్పుడా రావటం!'' సరదాగా నవ్వుతూ అన్నాడు బావ.

నళినికి తనలో కలుగుతున్న రకరకాల భావోద్వేగాలు క్షణంలో మాయమయినట్లనిపించింది. తననుకున్నదేదీ జరగలేదు. తను మామూలుగానే ఉంది. బావ అన్న మాటలు అప్పుడు చెవుల్ని తాకాయి. తన పరిస్థితికి నవ్వుకుంది.

''నువ్వు వచ్చి పదినిముషాలేకదు బావా అయింది,'' అంది.

ఈ పదినిముషాలు అద్దం ముందరే ఉన్నావు కాబోలు.''

''నేను అట్లా కనిపిస్తున్నానా?''

''నువ్వు మారిపోయినట్లనిపిస్తోంది నళినీ!''

''నువ్వు ఏమీ మారలేదు బావా!''

''ఐయామ్ సారీ, ఇతను శంకర్...''

నళిని నమస్కారం చేసింది.

''ప్రయాణం సుఖంగా జరిగిందా?''

''సుఖమా! వీడు, మా శంకర్, వీడు పక్కన ఉంటే సుఖంకూడాను. నిముషంలో అరనిముషమైనా జీవితం అని అనక మానడు. తన జీవితం, లోకచరిత్రను గురించిన విచారమంతా వీడిదే! కదూ శంకర్?'' అని నవ్వాడు.

నళినికూడా శంకర్‌వైపు చూసింది.

''ఔను,'' అని నవ్వుతున్నాడతడు. నవ్వుతున్నా, అతడి కనులు గంభీరంగా ఉన్నాయి. శంకర్ అంటే శివుడు. మంగళకరమైన మూర్తి. ఇతడిలో గంభీరమైన అందం ఉంది'' అతడిని చూస్తూ అనుకుంది నళిని.

మురళీ, శంకర్ ఆశీనులయ్యాక కాఫీ తెమ్మని సరోజతో చెప్పి నళినికూడా ఒక కుర్చీలో కూర్చుంది.

''ఏమైనా మారావా? ఇప్పుడుకూడా ఇరవైనాలుగు గంటల్లో పదహారు గంటలు ఆ లైబ్రరీలోనేనా ఉండటం! బయట ప్రపంచం ఏమైనా మారిందేమో కాస్త చూస్తున్నావా?'' అన్నాడు నవ్వుతూ.

''నాకు తెలియదే. నువ్వు రాకెట్‌లో భూప్రదక్షిణం చేసి వచ్చావేమిటి?'' అంది నళిని కళ్ళు పెద్దవి చేసి, ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ. మురళి శంకర్‌వైపు తిరిగి, ''చూడు ఆ పెంకితనం, పైకి తనంత శాంతం, అమాయికత్వం కలవాళ్లెవ్వరూ ఉండరనిపిస్తుంది'' అన్నాడు.

''మరి ప్రపంచం మారింది. అంటే – ఒహో, అవును ఇప్పుడు టెరిలిన్ ఫాషన్‌లోకి వచ్చింది. మా ఆడవాళ్ళకి కాటన్‌మీద మోజు ఎక్కువయింది. బాంబేలో ప్రస్తుతం ఏ చీరలు చెలామణిలో ఉన్నాయి బావా! అయితే బినాకా బుధవారం వస్తోందో లేదో మాత్రం తెలియదు. ఈమధ్య వినటం లేదు,'' అంది.

''ఆడవాళ్ళకి సైన్సు, పాలిటిక్స్ ఎందుకూ! వాళ్ళు ఆరెంటికీ దూరంగానే ఉంటే ఈ భూమి అందంగా ఉంటుందని నేనంటాను'' అన్నాడు మురళి.

''మరి బయట ప్రపంచం మారిందంటే, ఆడవాళ్ళు వాళ్ళ అందాలు దిద్దుకుంటూ విలాసాలలో మునుగుతూ ఉండటమేనన్నమాట'' అంది.

శంకర్ చిరునవ్వుతో నళినివైపు చూస్తున్నాడు. అది తెలుసు నళినికి. నళిని బుగ్గలు కొంచెం ఎరుపెక్కాయి ఆ మాటలు అంటుంటే.

''నువ్వు రాజకీయవేత్తవయినాసరే, సంఘసేవకురాలివయినాసరే, నీ యిష్టం; నా కభ్యంతరం లేదు. ఈ ఇరవైయవ శతాబ్దిలో ఆ మాత్రం స్వతంత్రం ఉండాలి. నా అభిప్రాయం చెప్పాలంటే - నువ్వు స్వతంత్రంగా ఏ పనిచేసినా సరే, నా కిష్టమే'' అన్నాడు మురళి.

'కాలం మారింది అంటాము. మనం చాలా నాగరికులం అనుకుంటాం. మనిషి తెలుసుకోగోరింది ఏమైనా తెలుసుకున్నాడా? మనిషి సమస్యలు ఏమైనా మారాయా? ఆదిమమానవుడికంటె ఎక్కువ సుఖశాంతులు పొందుతున్నాడా? జీవితం చాలా చిత్రమైనది! మానవుడిలో ఉండే మేధా, ఆత్మా - ఈ అనంత విశ్వాన్ని ఆక్రమించటం - ఆ ఔన్నత్యంలో మన జీవితాలెంత! సూర్యుడి వేడికి ఒక గంటలో బ్రతుకు ముగించి నేలరాలే పూలవంటివి'. శంకర్ మాటలు వింటూనే నళిని తనలో తను ఆలోచించుకుంటోంది.

''నేను ఎట్లా ఉన్నా, ఏమి చేసినా నీకు అభ్యంతరం లేదుకదు బావా?''

''ఉహుఁ, లేదు. నువ్వు నీ ఇష్టప్రకారం ఏది ఆచరించినా నాకు ఇష్టమే. ఇంతకూ మాకు కాఫీ ఏమైనా...?''

''అదుగో వస్తోంది...'' అని నళిని గుమ్మంవైపు చూసింది. కర్టెన్ తొలగించుకు సరోజ కప్పులు తెచ్చి బల్లమీద పెట్టింది సిగ్గుతో.

మురళి సరోజను గమనిస్తున్నాడు.

''సరోజ - బావా! మా పిన్నికూతురు. తల్లిపోయాక మూడునెలలనుంచీ ఇక్కడ ఉంటోంది,'' అంది.

చిరునవ్వు చిందించింది సరోజ.

''చిన్నప్పుడోసారి చూశావు బావా! అయినా నీకు నేను గుర్తుంటానా!'' అంది.

''ఇప్పుడు గుర్తుంటావులే, మరిచిపోకుండా,'' అన్నాడు వేళాకోళంగా.

నళిని ఆలోచించుకుంటోంది.

''నేను ఎట్లా ఉన్నా బావకి ఇష్టమే. బావకి నాదగ్గరనుంచి ఏం కావాలీ? మేడ, కారు ఉన్న మామగారు - ఆస్థి తెచ్చే భార్య! ఆఫీసర్ భార్య అందగత్తె

అనిపించుకోవటం కంటె ఏం కావాలి! చదువు ఉండనే ఉంది. మరి నేను! నాకు కావలసింది ఏమిటి? సరదాలు - సుఖాలు కాదు. నా బ్రతుకును, హృదయాన్ని, ఆత్మని అలమివేసి నేను ఈలోకానికి అతీతురాలిని అనిపింపజేసే ప్రేమ కావాలి. ఆప్రేమ వివాహం ద్వారానే కావాలి.

* * *

మరునాడు పొద్దున్న నళిని డాబామీదకి వెళ్ళింది. అప్పటికింకా బాగా తెల్లవారలేదు. ఆవేళలో మేలుకునే లోకాన్నీ, సూర్యుడి లేతకాంతిలో వికసించే ప్రకృతినీ, శ్రవణాల కింపైన రకరకాల ధ్వనులూ గమనించటం నళినికి ఆనందం. అటూ ఇటూ తిరుగుతూ, మామిడికొమ్మ డాబామీద ఆనుకున్నచోట ఆగింది. మామిడిచెట్టు లేతచిగుళ్ళు తొడిగి ఉంది.

'వీటిలో ఏముందని కోయిల ఈచిగుళ్ళని తింటుంది!' అనుకుంటూ ఒక చిగురుతుంపి నమిలింది. అది వగరుగా ఉంది.

'ఈ వగరులోంచి కోయిల కంఠంలోకి ఆ తీయదనం వస్తోందన్నమాట', అనుకుంది. తనచేష్టకి తనే నవ్వుకుంటూ - చూసింది అప్పుడు. క్రింద పంపుదగ్గర బావ ముఖం కడుక్కుంటున్నాడు. పనిపిల్ల గిన్నె ఒకటి కడగడానికి పట్టుకుని నుంచుంది.

''నీ పేరేమిటి??'' బావ అడిగాడు.

దానికి హటాత్తుగా నవ్వు వచ్చింది. పళ్ళు కనిపించేలాగ నవ్వుతూ, పమిట సర్దుకుంటూ, ''సావిత్రి'' అంది.

''ఓహో, సినిమా సావిత్రీ,'' అని గట్టిగా నవ్వుతున్నాడు బావ.

''మీరు బొంబై బాబుకదా! సావిత్రి తెలుసేంటండీ,'' అంది నవ్వుతూ.

''ఆఁ; సావిత్రి, జమున మా ఊరుకి కూడా వస్తారు'' అని నవ్వుతూ లోపలికి వెళ్ళాడు బావ.

''చినబాబుగారు చెడ్డసరదా ఐనోరు,'' అంటోంది పనిచేసేది వచ్చిన సరోజతో. అతడు వెళ్ళినవైపే చూస్తూ ఔనని తలతిప్పింది నవ్వుతూ, జూకాలూగిసలాడేలా.

నళిని మనసులో ఒక తెర వాలినట్లనిపించింది. బావ, సావిత్రి, సరోజ అందరి రూపాలూ చెరిగిపోయాయి. ఆమె మనసులో శూన్యం ఏర్పడింది. ఇప్పుడు తను చూసినది, తను విన్నది తనకేదో విచారం కలిగిస్తోంది. ఆక్షణందాకా తను పొందుతున్న ఆనందం మాయమైంది.

అకస్మాత్తుగా శంకర్ స్మృతిపథంలో మెదిలాడు. బావకీ, అతడికీ ఎంత తేడా!

'అతడి చూపులలో లోతులు, నవ్వుల్లో గాంభీర్యం, అతడితో పోలిస్తే - బావ - తన మనసు బావని మరచి కలలు కంటోంది' అనుకుంది నళిని.

ఆ సాయంత్రం ''మీ నళినితో మాట్లాడుకో. నేను ఊళ్ళోకి వెళ్ళివస్తా,'' నని శంకర్ వెళ్ళిపోయాడు.

''అతనితో వెళ్ళకపోయావా బావా!'' అంది నళిని.

''అవసరం లేదు. వాడే నన్ను నీతో మాట్లాడమని వదలివెళ్ళాడు. ఈ ఊళ్ళో తిరిగిరాలేడనే భయంకూడలేదు. మీనాన్న పేరు చెబితే ఎవరైనా దింపుతారు ఇంటి ముందు,'' అన్నాడు.

నళినీ, మురళీ మేడపై డాబామీద ఉన్నారు. నళిని కుర్చీలో కూర్చునుంది. మురళి దానిని ఆనుకుని వెనక నుంచుని ఉన్నాడు. వంగి ఆమె బుగ్గకి తన చెంపని తాకిస్తూ, ''నళినీ!'' అన్నాడు. నళిని మాట్లాడలేదు. బుగ్గమీద ముద్దుపెట్టుకున్నాడు.

''నళినీ!'' అన్నాడు.

నళిని ఏమీ చలించలేదు. కాదనలేదు. చిన్నబాలికలాగ ఆ ముద్దును స్వీకరించి నవ్వుతూ, ''ఏం బావా!'' అంది.

''నీకు ఆనందంగా లేదూ! తీయగా బాధగా లేదూ!'' అన్నాడు.

''ఊహుఁ. నాకేమీ కలగటంలేదు.''

అతడు కొంతసేపు ఊరుకుని,

''నీకు నేనంటే ఇష్టం ఉంటే ఇట్లాగ ఉంటావా? అంత నిగ్రహించుకోవలసినంత అవసరమేముంది! నిజమే. నేను మూడేళ్లు ఊరుకున్నాను. మా నాన్న ఆస్థి నీపేర రాయమన్నాడు; మామయ్యకి కోపం వచ్చింది. నాకూ మా నాన్నగారిపై కోపం వచ్చింది. పెళ్ళి చేసుకోనన్నాను. అది మనకీ మేలే అయింది. ఉద్యోగంలో స్థిరపడ్డాను., ప్రమోషన్ వచ్చింది. ఈపాటికి ఒకరిద్దరు పిల్లలు పుట్టి ఉండేవారు.'' నవ్వుతున్నాడు చెబ్తూ; నళిని వింటోంది. ''అంతమాత్రానికే నీ మనసు మారిపోవాలా! నామీద కోపమా? కాక నీ మనసు ఎవరిపైనైనా.....''

''ఏమిటి బావా! నా అంతఃపురంలోకి ఎవరు వస్తారు? నువ్వు మంచివాడివని, దాచుకోకుండా ఈ మాటలు చెప్పాలనిపిస్తోంది. విను నాలో

ఏదో కాఠిన్యం వచ్చింది. తపస్సు చేసే వ్యక్తిలో ఉంటుందేమో ఆ కాఠిన్యం. కానీ ఈతపస్సు దేనికోసం! ఎవరికోసం! నిజమే ఐదేళ్ళక్రిందట - నువ్వు వచ్చావు. ఇట్లాగే ఆరోజు నువ్వు నాభుజంమీద చేయి వెయ్యగానే నాశరీరం ఝల్లుమంది. చెంపని నీ పెదవులు తాకినప్పుడు నేను పరవసించిపోయాను. బావ నా సర్వస్వం అనుకున్నాను. ఆ అనుభవం నాకింకా గుర్తు ఉంది. కానీ ఇప్పుడు, నేను దాన్ని పొందలేకుండా ఉన్నాను బావా! ఇన్నాళ్ళూ ఏకాంతంగానే గడిపాను. నా జీవితం ఒక స్రవంతి అయితే అది ఆవిరై ఆలోచనల రూపం దాల్చింది. నా ఆలోచనలకి చైతన్యం కలిగితేనే కానీ నాలో చైతన్యం రాదు. దేనికో ఎదురు చూస్తున్నట్లుంటుంది. కానీ, దేనికోసం! ఈ భూమి ఇన్నేళ్ళనుంచీ ఇట్లాగ నిరీక్షణలో గడుపుతోంది దేనికోసం? నేనూ అంతే అనిపిస్తుంది బావా.'' నళిని కళ్ళలోనుంచి నీటిబిందువులు జారుతున్నాయి. మురళీ వాటిని తుడిచాడు.

''ఏమిటి నళినీ! ఆనందంగా గడపటానికి ఇన్నిమాటలు కావాలా. నువ్వు ఉత్త పిచ్చిపిల్లవి. నాకు తెలుసు. ఒంటరిగా ఉండటంవలన, నీకు సన్నిహితులు లేకపోవటం వలన నువ్వు అట్లాగ బాధపడుతున్నావు. ఇప్పుడింక బాధెందుకు! ఇక నిన్ను బాధపడనివ్వను.''

నళిని నవ్వింది. కానీ ఆమె చూపులలోని భావం మురళికి అందలేదు. మళ్ళీ పెదవులమీద ముద్దు పెట్టుకున్నాడు.

ఎందుకో ఆశ్చర్యం వేసిందతడికి. నళినిని వదిలి పక్క కుర్చీలో కూర్చున్నాడు.

''ఊహుఁ. నీకిష్టంలేదు. కనీసం నేనంటే నీకాకర్షణలేదు. నేను తెలుసుకోలేనంత మూర్ఖుడిని కాదు. పెళ్ళి విషయాలలో బలవంతమేమీ లేదు నళినీ! అయినా నాకు జాలివేస్తోంది.'' అన్నాడు.

నళిని నవ్వింది. మళ్ళీ అతడన్నాడు. ''జాలి ఎందుకు, జాలిపడాల్సిన అవసరం నీకేమీ లేదు'' అని నవ్వాడు. ఆ సంభాషణ అక్కడితో ఆపి సంగతులేవో చెప్తుంటే శంకర్ వచ్చాడు. లేచి నిలబడి అతడికి తన కుర్చీ ఇచ్చింది నళిని.

''మీరు కూర్చోండి'' అన్నాడతడు.

''క్రిందకి వెళ్ళి, భోజనాల ఏర్పాటు చూడాలి'' ''చిరుహాసంతో జవాబిచ్చి, అక్కడే పిట్టగోడకి ఆనుకుని నిలబడింది.

''అలాగా ఉన్నావేం?'' శంకర్ అడిగాడు మురళిని.

''మనం ఒకవిధంగా ఎదురుచూస్తే, జరిగేవి ఇంకొకలాగ ఉంటాయి. ఏమంటావ్?'' నవ్వుతూనే అన్నాడు మురళి.

''జీవితమే అంత!''

''మొదలుపెట్టావ్రా!'' అది సరియైన వ్యాఖ్యానం,'' నవ్వాడు మురళి.

శంకర్ మాట్లాడలేదు. సన్నగా రాగాలాపన ప్రారంభించాడు.

రాగం మెల్లగా పాట కాసాగింది. ముందు ఒక వెన్నెలపాట - నారాయణరెడ్డిది. తరవాత ఒక అష్టపది. తరవాత గీతాంజలిలో పాదాలు ఏవో ఇంగ్లీషులో తగ్గుస్వరంలో గంభీరకంఠంతో ఉచ్చరిస్తున్నాడతడు. నళినట్లాగే నిలబడుంది. ఆమె కన్నులార్ద్రతతో మెరిసినై.

''చూశావా, మావాడెంత బాగా పాడతాడో. నాకు పాటలంటే ఇష్టం అంతగాలేదు. కానీ, వీడు పాడుతుంటే ఏదో ఆనందం మన చేతుల్లోంచి జారిపోతోందనిపిస్తుంది. నాకు భయం కూడా.''

నళిని నవ్వింది. 'నాకు ఏవేవో అనుభూతులు కలుగుతాయి. ఏవో చిత్రాలు కనిపిస్తాయి. జీవితం ధన్యమయిందనిపిస్తుంది. ఆ ఆనందం బరువుగా ఉంటుంది.' నళిని తనలో అనుకుంది.

మురళి శంకర్వైపు తిరిగి,

''నిన్ను రెండురోజులాపాను. మీ ఆవిడ నీకోసం ఎదురుచూస్తోంది కాబోలు! ఆ పాపం నాది,'' అన్నాడు శంకర్తో.

శంకర్ నవ్వి, ''ఔను ఎదురుచూస్తుంది. నేను వెళ్ళగానే గుత్తి వంకాయకూరా, పెరుగుపచ్చడీ చేస్తుంది. ఈ నెలలో తను ఖర్చు తగ్గించి ఎంత నిలవచేసిందీ సంతోషంగా చెప్తుంది. నేను చిక్కిపోయాననంటుంది,'' అన్నాడు.

''వదినగారికి ఎట్లాగైనా నువ్వు అంటే చాలా ప్రేమరా.''

''ప్రేమ!'' అన్నాడు శంకర్.

నళిని క్రిందికి వెళ్ళిపోయింది.

''అక్కా వాళ్ళని భోజనానికి పిలవనా?'' అడిగింది సరోజ. జరీ అంచువున్న ఎరుపు సిల్క్చీర కట్టుకుంది సరోజ. రెండు జడలు వేసుకు ఒక జడలో ఎర్ర గులాబీలు పెట్టుకుంది. ఎర్రని తిలకం, నల్లని కాటుక పోటీపడుతూ కాంతులీనుతున్నాయి. నళిని ఒక్షణం నిదానించి చూసి, ''ఇవేళ నువ్వు అద్భుతంగా ఉన్నావ్ సరోజా! వెళ్ళి పిలుచుకురా,'' అంది.

నళిని తన గదిలో కిటికీ దగ్గర నిలబడింది. 'అతను చాలా బాగా పాడాడు. అతని స్వరం వెన్నెలలో కలిసిపోయి ప్రవహించింది. అతడు తనని తాను మరచిపోయి పాడాడు. వొత్తైనజుట్టు, దట్టమైన కనుబొమలున్న చిన్నకళ్ళు,

కళ్ళల్లో కాంతులనీనుతున్న కనీనికలు, సన్నగా పొడవైన ముక్కు, అందమైన పెదవులు, అందాన్ని చెడిపోనివ్వకుండా మీసం - కళ్ళలోనుంచి వస్తోంది అతడి గానం. ప్రశాంతమధురంగా ఉందతని స్వరం. నన్ను నేను మరిచిపోయాను. నా మనసు ఒక అందమైన యువతిగా మారి వెళ్ళి అతడిని కౌగలించుకుంది.' నవ్వుకుంది. 'ఏమిటీ భావం!' అనుకుంది.

* * *

శంకర్ వెళ్ళిపోయాడు. ఆరోజు ఇంకా సాయంత్రం అవలేదు. మురళి వచ్చి, ''మనం ముగ్గురం సినిమాకి వెడదాం నళినీ,'' అన్నాడు.

''నా ఫ్రెండ్స్ వస్తున్నారు బావా! నిన్ను చూడటానికే అనుకుంటాను,'' అంది, కొంచెం నవ్వుతూ.

''వస్తే రానీ, నాకేం భయం లేదు,'' అన్నాడు మురళి గట్టిగా నవ్వి.

నళిని గది చాలా సందడిగా గొడవగా ఉంది. నల్గురు స్నేహితురాండ్రొచ్చారు.

''నళినికి ఇంత సరదాగా ఉండే ఫ్రెండ్సు ఉన్నారా?''

మురళి అట్లాగనుకుని ఆ గది కర్టెన్ ఒకసారి తొలగించి గుమ్మంలో ఒక నిముషం నిలబడి చూసి వెళ్ళిపోయాడు.

''బాగున్నాడు'' ఒక అమ్మాయి అంది.

''వింటాడు''

''వినాలనే!'' తరవాత నవ్వులు, సందడిలో మాటలు వినిపించలేదు.

అతడి ముఖం కిటికీదగ్గర రెండుసార్లు కనిపించింది. నళిని నిట్టూర్పు విడిచింది.

''అతని కళ్ళలోఎంత కుతూహలం! ఏం వెతుకుతున్నాయా కళ్ళు! నా కోసమా!' నవ్వుకుంది నళిని. మనసులో ఏవో నిర్ణయాలు జరిగిపోతున్నాయి; ఆర్ద్రత తర్గిగి గట్టిపడుతోంది మనసు.

లోపలికి వెళ్ళింది - ''రా బావా పరిచయం చేస్తాను,'' అంది.

''నేను రావాలా?'' అన్నాడు కాలర్ సర్దుకుని, క్రాప్ సరిచేసుకుంటూ.

నళిని నవ్వింది. ''తప్పకుండాను. నీ కిష్టమైతే ఒకరిని వరించవచ్చు కూడాను.''

''ఛా - నీవు నాకు ఉన్నావుకదూ!''

''ఇంకా పుస్తె కట్టలేదుకదు బావా!''

పరిచయం అయ్యాక ఒక గంట ఉండి అతడు బయటికి వెళ్ళాడు. కొంచెంసేపుండి గుమ్మందగ్గరకు వచ్చి ''సినిమాకి టైమ్ అవుతోంది నళినీ'' అన్నాడు.

''నేను రాను బావా!'' అంది నళిని.

''పోనీ నీ ఫ్రెండ్స్‌ని కూడా తీసుకురా!'' చిరునవ్వుతో అన్నాడు.

''నాకు రావాలని లేదు,'' అంది నళిని.

అతడు వెళ్ళిపోయాడు.

''వెళ్ళరాదూ; అతడెంత నిరుత్సాహపడ్డాడో,'' అంది వనజ. నళిని నవ్వింది.

''మేము వెళ్ళిపోతాం. నువ్వు సినిమాకు వెళ్ళు అతడితో,'' అంది శారద. నిర్మల నళిని ముఖంలోకి చూస్తోంది.

''ఊహుఁ,'' అంది నళిని.

కొంచెంసేపయ్యాక సరోజ వచ్చి ''బావ సినిమాకి రమ్మంటున్నాడు. వెళ్ళమంటావా అక్కా,'' అని అడిగింది.

''వెళ్ళు,'' అంది నళిని. సరోజ ఉత్సాహంగా వెళ్ళిపోయింది. స్నేహితులంతా వెళ్ళారు. నిర్మల ఉంది.

''నీ మనసులోమాట ఏమిటి నళినీ,'' అంది నిర్మల, నళిని చేతిని తన చేతిలోకి తీసుకుంటూ. అంతా వెళ్ళినా నిర్మల వెళ్ళలేదు. చల్లగా ఉంటుందని డాబామీద కూర్చున్నారు ఇద్దరూ.

''ఏమని చెప్పేది నిర్మలా!'' అంది.

''నువ్వు మీ బావతో తృప్తిపడినట్లు నాకు అనిపించటం లేదు,'' అంది నిర్మల నళిని ముఖంలోకి చూస్తూ. నళిని అప్పుడు నిర్మలవైపు చూసింది; నవ్వి –

''ఔను నిర్మలా, అతడి ప్రేమకి ఏకాగ్రత లేదు. అతడు నాకోసం ఆగలేడు. నా నిర్ణయం జరిగిపోయింది,'' అంది.

నిర్మల మాట్లాడలేదు. వెళ్ళేముందర మాత్రం అంది – ''నువ్వు మీ బావని పెళ్ళి చేసుకోలేకపోతే ఇంకెవ్వరినీ పెళ్ళి చేసుకోలేవేమో!''

''కావచ్చు,'' అంది నళిని.

''లౌకికంగా చూస్తే నీ నిర్ణయం తెలివితక్కువ అనిపిస్తుంది. కొన్నాళ్ళు పోయాక విచారిస్తావేమో!''

''నా మనసు ఒంటరితనానికి అలవాటు పడిపోయింది నిర్మలా'' అంది నళిని.

* * *

సరోజా, మురళీ సినిమానుంచి వచ్చాక నళిని క్రిందికి వెళ్ళింది. ముగ్గురూ భోజనానికి కూర్చున్నారు. ''వనజ ఎవరమ్మాయి నళినీ?'' మురళి అడిగాడు. నళిని మురళి ముఖంలోకి చూసింది.

వనజ బొద్దుగా, పచ్చగా ఉంటుంది. చక్కగా అలంకరించుకుంటుంది కూడా.

''వనజ బాగా ఆర్జిస్తున్న ఓ అడ్వకేట్‌గారి కూతురు. ఏం, మనసు లాగేసిందా? మాట్లాడమంటావా?'' అంది నవ్వుతూ.

భోజనం ముగించి వాష్ బేసిన్‌లో చేయి కడుగుతూ, ''ఏమిటి ఇట్లా మొదలెట్టావ్,'' అన్నాడు. నళిని తలవంచుకుని అన్నం తినటం సాగించింది.

* * *

సంజవేళ - చెట్లమధ్య కుర్చీలో కూర్చుంది నళిని - ఆలోచిస్తోంది.

'ఈ పెళ్ళివలన ఇద్దరికీ సుఖం ఉండదు. బావకి సరదాలు కావాలి. ఏకాగ్రత అతడి స్వభావంలో లేదు. కానీ నాకు ప్రేమలోకూడా ఏకాగ్రత కావాలి. ఒకరి కోసం ఒకరు అర్పితులైపోవాలి. ఇదే నా కోరిక. కానీ బావ! అతనికి అనేక సరదాలు. అతని సరదాలు నేను తీర్చలేకపోవచ్చు. తీర్చలేను. బావకు నామీద ఆపేక్ష ఉన్నా, మోజు, ఆకర్షణ ఎక్కువరోజులు ఉండవు. అప్పుడు ఫలితం బావకి నేను దూరం కావటం.

''అతడిలో లీనమైపోవాలనే తహతహకి, అతడి సుఖదుఃఖాలలో ఒకటైపోవాలనే ఆరాటానికి, అతడే - నేను ఐపోవాలనే ఆరాధన - అర్థం, ఆధారం లేకుండా పోతాయి.

'అది నేను భరించలేను. అంతకంటె ఇట్లా అవివాహితగానే ఉండిపోతాను. ఉండి, నా ఊహామూర్తికోసం నిరీక్షిస్తుంటాను. అది నా తపస్సు.

'శంకర్ నన్ను కదలించాడు. అతడు వివాహితుడు. అటువంటి వ్యక్తి వేరొకడు నా జీవితంలో తటస్థపడతాడా? పడకపోవచ్చు. అప్పుడు నా బ్రతుకు నిరీక్షణే. శంకర్ నా ఆరాధనకి ఒక మూర్తిని కల్పించి వెళ్ళాడు.' నవ్వుకుంది నళిని.

''నువ్వు బాగా ఆలోచించుకోలేదనుకుంటాను నళినీ?'' కొంచెంసేపైవచ్చి పక్కనే ఇంకో కుర్చీలో కూర్చున్న మురళి అన్నాడు.

''నేను బాగా ఆలోచించుకున్నానుబావా! ఇది మన ఇద్దరికీ శ్రేయస్కరం. నువ్వు సరోజని పెళ్ళిచేసుకో. నీ ఉద్యోగానికి, సరదాలకి అన్నివిధాల తగింది.''

''అసలు నీ ఊహ ఇట్లా మారిపోవటానికి కారణం ఏమిటో నాకర్థం కావటం లేదు నళినీ! నా మనసు సమాధానపడటంలేదు. నిన్ను పెళ్లి చేసుకోవాలని, అన్నివిధాల నిన్ను సుఖపెట్టాలన్న ఉద్దేశంతోనే నేనిక్కడి కొచ్చాను.

నళిని, కుర్చీకి దగ్గరగా ఉన్న నైట్‌క్వీన్ గుబురుల్లోంచి ఆకులు తెంపుతోంది. రాత్రి కొంచెం చీకటిగానే ఉంది. వరండాలోని లైటుమాత్రం ఆ ప్రదేశాన్ని కొంత కాంతివంతం చేస్తోంది. మురళి నళినివైపే చూస్తున్నాడు. తెల్లటి చెవిమీద నల్లగా సన్నటి జడపాయ ఒకటి జారుతోంది. దానిక్రింద ముత్యాలదుద్దు మెరుస్తోంది. పక్కగా కనిపిస్తున్న నళిని ముఖంలోని అందం అతడిని తాకుతోంది.

నళిని మనసు అల్లకల్లోలంగా ఉంది. కానీ, దానిమధ్య ఆమె నిర్ణయం చెదరకుండా ఉంది. బావకి సమాధానమీయటం ఎట్లాగని ఆలోచిస్తోంది నళిని.

''నేను నీకు తగను బావా!'' అంది ఒకసారి తలయెత్తి.

''కాదు. నేను నీకు తగననే నీ భావం'' అన్నాడు నొక్కి పలుకుతూ, నవ్వుతూనే.

''అదికాదు బావా! నీ అభిరుచుల కనుగుణంగా నేను ఉండలేనని నా భయం.''

''అట్లా ఉండాలని నేను నిన్ను కోరటం లేదు నళినీ.''

''కానీ నేను ఆ విధంగా ఉండలేను బావా! ఎవరి అభిరుచులు వారు పాటిస్తే తప్పకుండా మనిద్దరిమధ్య దూరం అధికం అవుతుంది. భార్యాభర్తలు సన్నిహితంగా ఉండలేకపోయాక మనసులో ప్రేమ దాగిఉన్నా అది పరిమళిస్తుందా? రాణిస్తుందా బావా! నాకు తృప్తి ఉండదు. నీకు కూడా తృప్తి ఉండదు. ఎందుకు మభ్యపెట్టుకోవటం? చిన్నవాళ్ళం కాదు కదా ఊహాలోకంలో విహరిస్తూ వాస్తవాల్ని విస్మరించగలిగేటందుకు.

''మన అభిరుచులు వేరనీ, సుఖపడలేమనీ ఎప్పుడు గ్రహించావు నళినీ!''

నళిని భారంగా ఊపిరి వదిలింది.

''నువ్వు చాలా సరదాగా ఉంటావు బావా! అట్లాగే నీలాగ అందరితో సరదాగా మెలగవలసిన యువతి నీకు తగుతుంది బావా! నేను ఒంటరి జీవితానికి అలవాటు పడ్డాను. సరదాలకీ, సుఖాలకీ నా మనసు చలించదు. అటువంటి నేను నిన్ను సుఖపెట్టలేనని నా భయం; కాదు నమ్మకం.

''అయితే అసలు పెళ్ళిచేసుకోవా?''

''అట్లాగని నే నిర్ణయించుకోలేదు.''

''నిన్ను చూస్తే జాలివేస్తుంది నళినీ! నీ జీవితం. పెంపకం అట్లాగ గడిచాయి. నిన్ను నా సుఖదుఃఖాలలోకి తీసుకు వెళ్ళాలనీ, ప్రపంచానికి చూపించాలనీ ఎన్నో అనుకున్నా. నీవు ఈ ప్రపంచానికి దూరంగా ఉంటానంటావు. నీకు స్నేహితులు లేక ఇట్లాగ ఉన్నావు కాని, నలుగురిలో తిరుగుతూంటే మారిపోతావు నళినీ! ఆమార్పు నీలో నేను తీసుకురాగలను. నే పందెం వేస్తాను,'' అన్నాడు.

నళిని విచారంగా నవ్వింది; ''లేదు బావా! నే మారలేను. నాకు తెలు''సంది.

మురళి కొంచెంసేపు ఊరుకుని -

''నిన్ను ఇట్లాగ పెంచిన మీ నాన్నని అనాలి. నాకు ఇప్పటికీ జాలి వేస్తోంది. ఇంకా నాకు అభ్యంతరం లేదు. కానీ నాకు ఒక అనుమానం వచ్చింది. ఆడవాళ్ళకి అసూయ అంటారు. సరోజతో చనువుగా వుంటానని నీకు కోపం వచ్చిందా?''

''లేదు బావా! కోపం రాలేదు. ఒక రకంగా నిన్ను అర్థం చేసుకోగలిగానని చెప్పవచ్చు. వివాహమంటే ప్రణయం కూడాను. ప్రణయంలోకూడా ఏకాగ్రతని కోరతాను నేను. అటువంటి వాళ్ళు ఉండరని నీవు నవ్వవచ్చు; జాలిపడవచ్చు. కాని అది నా ధ్యేయం. ఫలితం లేకపోయినాసరే. నిరీక్షణలోనే నా బ్రతుకు గడుస్తుంది. సరోజ అన్నివిధాలా నీకు తగినది. నువ్వు సరోజను పెళ్ళిచేసుకుంటే నేను సంతోషిస్తాను.''

''నువ్వు ఏవేవో కల్పించుకుని సుఖాన్ని దూరం చేసుకుంటున్నా వనిపిస్తోంది నళినీ! మీ నాన్న ఉన్నన్నిరోజులూ, నీకు లోటు తెలియకపోవచ్చు. నీకు ఆర్థికంగా కూడా ఏలోటూ తెలియకపోవచ్చు. కానీ ఆ తరవాత, నీకు నా అనేవాళ్ళు ఉండాలి కదు నళినీ....''

''నువ్వూ, సరోజా నాకు ఎప్పుడూ ఉంటారు బావా! నా బ్రతుకు ఈ ఇంట్లో ఇలాగే గడిచిపోతుంది.''

మురళి మాట్లాడలేదు. నళిని కుర్చీలో కూర్చుని పుస్తకం చదువుకుంటోంది.

సరోజ వచ్చింది ఆ గదిలోకి. తను తెచ్చినపూలని ఫ్లవర్‌వేజ్లో అమరుస్తూ

అంది : ''బావని నువ్వు ఎందుకు పెళ్ళి చేసుకోనన్నావో నాకర్థం కావటం లేదక్కా.''

సరోజకి బావని చేసుకోవటం ఇష్టంగానూ ఉంది. నళిని ఎందుకో ఒప్పుకోలేదని సందేహమూ ఉంది. నళిని తను చదువుతున్న పుస్తకం వదిలి లేచింది. సరోజ భుజంమీద చేయివేసి ప్రేమపూర్వకంగా నవ్వుతూ అన్నది :

''బావ చాలా సరదాలు ఉన్నవాడు సరోజా! అతడు సంతోషంగా ఉండాలంటే అటువంటి భార్య కావాలి. నువ్వు చిన్నదానివి. ఉత్సాహంతో ఉరకలువేసే హృదయం నీది. నువ్వు బావకి సరిపోతావు. నేను ఒంటరిగా గడపటానికి అలవాటుపడ్డాను. నాన్న అభిరుచుల ప్రకారం నడుచుకుంటూ జీవించాను. సంపదలు తెచ్చే ఈ సుఖాలన్నింటికీ అలవాటుపడిన నాకు ఇవి ఉత్సాహాన్నీ, సంతోషాన్నీ ఇవ్వలేవు. ఒక మాటలో చెప్పాలంటే నా మనసు ఎదిగిపోయింది సరోజా! నావంటివాళ్ళు ఒంటరిగా ఉంటేనే నయం. నేనసలు పెళ్ళి చేసుకుంటానో లేదో కూడా చెప్పలేను; అంతే. నువ్వు సంశయాలు పెట్టుకోకు. బావ అన్నివిధాలా నీకు తగినవాడు. మీ ఇద్దరినీ మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తున్నాను.''

సరోజ ఏం మాట్లాడలేదు. ''బావలాగ సరదా ఐనవాడు; అందం, ఉద్యోగం, ఆస్థి ఉన్నవాడు దొరకటం ఎంతదృష్టం.''

సంతోషంతో అక్కడనుంచి వెళ్ళింది సరోజ.

మురళి సరోజని పెళ్ళి చేసుకుని తీసుకువెళ్ళిపోయాడు.

* * *

బావ వచ్చాడు, వెళ్ళాడు!

కానీ తన జీవితంలో మార్పులేదు. ప్రశాంతంగా ఉన్న రాత్రిలో కిటికీలో నుంచి దూరతీరాలవైపు చూస్తోంది నళిని.

'నేను పొరబాటును చేశానా? లేదు. జీవితములో ఏది పొందాలని ఆశించానో అది పొందలేనని నమ్మకం కోల్పోయినప్పుడు ఇంక ఆ పెళ్ళి చేసుకోవటం ఎందుకు? సరోజ, వనజ, సావిత్రీలతో బావ - అతడిలో చెదిరిన కాంక్షలు, కళ్ళలో మెదలాడే తృష్ణలు - బావ ఏమిటో నాకు తెలుసు. అతడిని విశ్వసించకుండా అతడితో కలిసి జీవించలేను. పవిత్రతని కోరే నా ప్రశాంత హృదయం అతడి కోర్కెల ఉనికిని సహించలేదు. బావలో ఈ గుణాన్ని నేను క్షమించలేను. ఆ పరిస్థితిలో అతడితో పెళ్ళి, నా జీవితంలో వక్రతని

ప్రవేశపెడుతుంది. దానిని మొదట్లోనే తృంచాలి. అపశృతుల సంగీతం నేను పాడలేను. మోహనరాగం నేను ఆలపించలేకపోయినాసరే. వివాహం లేకుండా ఉండిపోతే ఏం?

'అసలు ఈ సృష్టి సర్వం ఒక నిరీక్షణకి అర్థం. ఎన్నాళ్ళనుంచీ ఈ ఆకాశపుటొడిలో భూమి దేనికోసం నిరీక్షిస్తోంది!

'ఈ సముద్రపు టలలు నిర్విరామంగా భూమిని రాసుకుంటున్నాయి! అనాదిగా మానవుడి ఆత్మ దేనిని తెలుసుకోటానికి పరితపిస్తోంది? అన్వేషిస్తోంది?

'ఇదంతా ఒక అన్వేషణకీ, నిరీక్షణకీ అర్థం. నా బ్రతుకూ ఈ అనంత నిరీక్షణలోనే ముగిసిపోనీ. ఈ వైవాహిక సుఖదుఃఖాలకు దూరంగానే నన్ను నిలచిపోనీ. ఈ సుఖదుఃఖాలలో పంకిలమై అశాంతికరమైన బ్రతుకు నాకు వద్దు. ఒక మహాప్రశాంతి, నిరీక్షణలో నా బ్రతుకు గడిచిపోనీ...' అనుకుంది.

ఆశయాలకోసం, అభిప్రాయాలకోసం అవివాహితలుగా ఉండిపోయే కన్యలను చూస్తే కలువలు గుర్తుకొస్తాయి. ప్రపంచానికి దూరంగా, భూమిని విడిచి, నీటిలో పుట్టి వికసించే కలువలు ఒక ప్రశాంత దృశ్యాన్ని గోచరింపజేస్తాయి. తపసులో ఉన్న కన్యలలాగ కనిపిస్తాయి.

భూమిమీద వికసించేపూలకి, కలువలకి ఎంతో వ్యత్యాసం ఉంది.

పూలు నవ్వుతూ, ఆకర్షిస్తూ, పిలుస్తూ ఉంటాయి. కలువలు మౌనంగా, గంభీరంగా సంగీతం ఆలపిస్తూ ఉంటాయి.

పూలది సంసారిప్రేమ.

కలువల ప్రేమలో ఆరాధన ఉంది; కలువలకు చేతుల కందని చందమామ కావాలి. అదే కలువల తపస్సు.

అవివాహితగా ఉండిపోయిన ఈ నళిని జీవితం పాడేది ఆ కలువల సంగీతమే!

యువ

* * * *